# అతన్ని అర్థం చేసుకునేదెలా ?

శ్రీ మ. చంద్రశేఖరరావు.

మా అమ్మ యెంతో మురిపెముతో, ఉద్యోగము వెలగబెట్టి తన్ను సుఖపెడతానని, వున్న మా పిత్రార్జితము కాస్తా ఖర్చుచేసి చదువు చెప్పించింది నాకు. ఎట్లాగో ఫోర్తుఫారం దాకా దేకాను. డబ్బేమో అయిపోయింది. దానితో పాటు చదువుకూడా ఉద్యోగం చూపుమేరలో కనుపడలా! ఇంట్లో జరుగుబడిలేదు. ఆ రోజుల్లో తేలిగ్గా దొరికే కారుకండక్టరుగా మోటారు సర్వీస్ కంపెనీలో జేరాను.

నర్సయ్యా నాతోపాటు లక్ష్మి మోటారుసర్వీస్‌లో పనిజేస్తూండేవాడు. నేను కండక్టరుగాను, అతడు డ్రైవరుగాను ఒకేకారులో పనిజేశాము. నర్సయ్యా జబ్బపుష్టిగల మనిషి, వ్యాయామముచేసి కరుడుగట్టిన కండలుగల దేహం. నిర్మొగమాటముగా నిర్భయంగా మా హక్కులకొరకు పోరాడే శక్తిగలవాడు. అందుచే, మా సర్వీస్‌లోని నావంటి అర్భకులమైన పనివాళ్లందరికీ అతని యెడల అభిమానం. మాలో యెవ్వరినైనా అవమానించిన వారల పసపట్టందే వదిలేవారముకాదు, మోటారు డ్రైవరుకే యింత అహమా, అనుకొనే పెద్ద మనుష్యులు మావాడిని రౌడీ, 'వాడి జోలి మన కెందుకు' అని సణుక్కొనేవారు.

* * *

అతనిలో ఆకస్మికముగా కలిగిన ఆ మార్పు అత్యద్భుతము, ఎదుటవారి హంగామా, పెత్తనాన్ని సహించి యెరుగని పొగరుబోతు,- దెబ్బకు తన్నుతో జవాబు యిచ్చే రౌడీ, పది మందిని ఒకేసారి యెదిరించగలిగిన వస్తాదు,-ఇతనికి ఒకచెంపకొట్టిన రెండోచెంప చూపమనే గాంధి తత్త్వం యెటుల నచ్చినదో ఏమటో- వుప్పు పండిస్తామని, కల్లు సారా దుకాణములవద్ద పికిటింగు చేస్తామని, తద్వారా స్వరాజ్యం తెస్తామని, యేవేవో అర్థంగాని అతకని కేకలువేస్తూ ఊరేగింపులు జేస్తున్న కాంగ్రెసు వాలంటీరులనుజూచి వుప్పొంగి పోయాడు. తానూ వాలంటీరుగా చేరతానని శిబిరంలోకి వెళ్లాడు. గాంధిటోపీ పెట్టుకొన్న పొడుగాటి ముక్కాయన మావాణ్ణి చూచి నవ్వి, వాలంటీరుగా పని జేశేవారు చాలా కష్టాలు పడాలని, పోలీసులు తిట్టినా చావగొట్టినా సహించాలని, యే పరిస్థితుల్లోను అహింస వీడరాదని. యెల్లప్పుడూ వడుకునూలు బట్టలు కట్టాలని చెప్పాడు నేను యీ తిప్పలన్నీ యెందుకండి అని అడిగాను, ఇవన్నీ చేస్తే స్వరాజ్యం వస్తుందన్నాడాయన.

నర్సయ్యా అయిదు రూపాయిలు పెట్టి ఖద్దరుకొని కట్టి శిబిరంలో జేరాడు. చిన్నాపురంలో ఉప్పు తయారుజేశారు కాంగ్రెస్ వలంటీరులు. ఆ వుప్పు తెచ్చి రాబర్టసన్ చౌకులో వేలంవేశారు. ప్రభుత్వం నాయకులను అరెస్టుజేసింది. టవరుపై కట్టిన జెండాను తీసి వలంటీరులపై లాఠీచార్జీజేశారు పోలీసులు. ఎక్కువదెబ్బలు మానర్సయ్యావంతు. మరునాడు మరల నర్సయ్యా జెండాను ప్రతిష్ఠించటానికి సత్యాగ్రహులతో సహాహాజరైయ్యాడు. తయారైంది

లాఠీలముతా. నిచ్చెనపై యెక్కు-తున్న నర్సయ్యను మోదటం మొదలెట్టారు. చూచినవాళ్ళు అరవై డెబ్బైయిదెబ్బలు పడ్డాయి అన్నారు. పట్టుదల వదలలేదు. ఎట్లో జెండా టవరుపై వుంచాడు. వెంబడించిన కానిస్టేబిలు అక్కడనుండి నరసయ్యను పడద్రోశాడు. అంత యెత్తునుంచి లాఠీ దెబ్బలతోనలిగిన నర్సయ్యదేహం క్రింద పడింది. హరిహరీ గొల్లుమన్నారు చూచే ప్రజలు.

పత్రికలు నర్సయ్యగారిని పొగడాయి. అతని ఓర్పుకు పట్టుదలకు జేజేలు కొట్టాయి. అతనికి తానూ గొప్ప వాడిననే ధీమా యేర్పడింది.

* * *

మా నర్సయ్యను సంవత్సరము కఠినశిక్ష వేసి కొరాపుట్టి జెయిలుకు పంపారు. అది యేజెన్సీ ప్రాంతము. మలేరియా ప్రదేశము. సామాన్యంగా రాజకీయ ఖైదీలను అదనపు శిక్షగా మాత్రం, జెయిలు వుద్యోగస్తులు పంపుతారు. అచ్చటనున్న అందరివలెనే నర్సయ్యకు కూడా సోకింది మలేరియా. జెయిలులో నర్సయ్యకు గాంధితత్వం బాగా అంటుకుంది. అదివరకు అక్షరాలైనా సరిగా రానివాడు మలేరియాతో మూలుగుతూనే చదువసాగాడు. కొంచెము చదువుట వ్రాయుట నేర్చుకొన్నాడు. గాంధిగారు గొప్పగా పొగిడే భగవద్గీత చేత బట్టాడు. అర్థం కాకపోయినా రోజూ రెండుపూటలా మననం చేస్తుండేవాడు.

మా వాడితో పాటున్న సత్యాగ్రహులు కొందరు, నర్సయ్య ఛాందసాన్ని, గాంధి తత్త్వాన్ని చూచి వెక్కిరించేవారు. నర్సయ్య తాను గాంధితత్త్వాన్ని నాయకుల బోధను పూర్ణంగా ఆచరించే యోగిగా పశుబలాన్ని లెక్కచేయని ధీరుడుగా యెంచుకొనేవాడు. దరిద్రనారాయణుడు మహాత్ముని బోధను అర్థం చేసుకోలేక తన్ను వెక్కిరించే వారిని ఇంగ్లీషు చదువువల్ల బుద్ధులు పెడతిరిగిన అల్లరిబడిపిల్లవారి క్రింద లెక్క వేసేవాడు. తత్ఫలితంగా అప్పుడప్పుడు వీరి మధ్య కీచులాట వచ్చేది.

ఎలాగైతేనేం కాలం గడిచి పోయింది. గాంధి ఇర్విను సంధి జరిగి అంతా విడుదలయ్యారు. ఆ ఇంగ్లీషు చదివిన కుర్రాళ్లు, ఇంగ్లీషు పత్రికలో బెర్నార్డుషా వ్యాసం చదివి, గాంధిగారు ప్రభుత్వానికి లొంగి పోయాడంటూ ఆక్షేపించారు. ఈ కుర్రకుంకల కేమి తెలుసు? మా మహాత్ముడు ప్రభుత్వాన్ని కాళ్ల బేరానికి తెచ్చాడనీ తన శక్తిద్వారా గాంధిగారు కొలది కాలంలోనే స్వరాజ్యం తెస్తాడని చంక లెగరవేసుకొంటూ మా వూరుచేరాడు నర్సయ్య,- నిండైన మలషి యెండి రూపుమారి.

పాత స్నేహితుణ్ణి నేను కలుసుకొన్నా. ఆరోగ్యాన్ని గురించి, జెయిలు జీవితాన్ని గురించి, కొంత కాలక్షేపం. తరువాత మాయిద్దరి సంభాషణా రాజకీయల్లోకి దిగింది.

నేను-మీరు విదేశీ సరుకులు మనం కొనగూడదు అంటారుగా, స్వరాజ్యం వస్తేమాత్రం అవి రాకుండా చేస్తారా?

నర్సయ్య-అప్పుడు వానిపై యెక్కువ దిగుమతి పన్నులువేసి మనదేశ పరిశ్రమలను రక్షిస్తారు.

నేను-అయితే అప్పుడు వస్తువుల ఖరీదు హెచ్చి మన రకం బీదవాళ్లు కష్టపడరా ?

నర్సయ్య--మరి దేశంకొఱకు కొన్ని కష్టములు అనుభవించవద్దా? త్యాగం లేకుండా, యే గొప్ప కార్యమైనా సాగుతుందా!

నేను-సరే బీదవాళ్ళూ కూలీలు స్వరాజ్యం కొఱకు వుద్యమంలో చేరాలంటున్నారు. బాగానే వుంది; కాని, స్వరాజ్య ప్రభుత్వంలో విదేశ వస్తువులపై పన్ను వేసి దేశీయ పరిశ్రమలను రక్షిస్తా మంటారేగాని, ఫ్యాక్టరీలలో పనిజేసేవాళ్ళకు, రెక్కలు విరచుకు పొలాల్లో పనిజేసే వ్యవసాయదార్లకు యేమేమి లాభం చేస్తారో స్వరాజ్యంలో,

వారికేమి--హక్కులిస్తారు ఒకరూ చెప్పరేమి నర్సయ్యా?

నర్సయ్య-ఫలాపేక్షవదలి అందరము మాతృదేశ దాస్య విముక్తికి ప్రాణా లర్పించి పోరాడాలికాని, ఈ బేరాలుచేయటం, "మాకేమి వస్తుంది మాకేమిస్తారు" అని అడుగుట స్వార్థం సంకుచిత స్వభావం అని నాయకు లన్నారు, రేపు భోగంవాళ్లు 'మేమూ పోరాటములోకి వస్తాము కాంగ్రెస్ స్వరాజ్యంలో మాకేమి యిస్తుంది,' అని అడిగితే యీ కసి సాయల అందరికి జవాబు చెప్పటం కాంగ్రెస్‌పనా? అని యీసడించాడు.

నేను--నర్సయ్యా? నీవు పెద్ద పెద్దవారి తియ్యనిమాటల భ్రమలో వున్నావు. విదేశవస్తువులపై పన్ను వేసి పరిశ్రమలకు-అంటే యజమానులకు లాభం కలుగ జేస్తుంది. అంటున్నావు. వస్తువులు ఖరీదు పెరిగి ఇప్పటికే కనీసంవంటి నిండా బట్టయినా లేని బీదా సాదా అవస్తలు పడరా అంటే మాతృదేశము కొరకు త్యాగం అవుసరమన్నావు. ఆ ఫ్యాక్టరీలలోనే రక్తం ధారబోసి పనిజేస్తూ జీవితానికి కావలసిన కనీసపు సౌకర్యాలైనా లేని కూలీలకు కాంగ్రెస్ యేమిజేస్తుంది అంటే కోపపడతావు. కాంగ్రెసు కార్యక్రమముతో కూలీలకు కావలసిన హక్కులు యెందుకు చేర్చరు?

నర్సయ్య--అవన్నీ తరువాత మనలో మనము పరిష్కరించుకో వచ్చన్నాడు మహాత్ముడు.

నేను--అక్కడేవుంది కిటుకు! యజమానులకు కావలసిన వాటికి యిపుడే ప్రాముఖ్యమిచ్చారు. మా సంగతేమని మనవంటి బీదలంటే తరువాత చూచుకుందాములే అంటారు. పైగా భోగంవాళ్లూ అడుగుతారని వెక్కిరింపు. ఆ వెధవ వెక్కిరింపులు నీవు చిలుక పలికినట్లు బుర్రలేకుండా వొప్పజెప్పావు. అవును వాళ్లకే హక్కుంది అడగటానికి!

నర్సయ్య--అవునోయి వాళ్లలా పశ్నిస్తే యేమి జవాబుచెప్పాలి.

నేను-చెపుతావిను, మీ నాయకులకు నేర్పు; వాళ్లు అలా అడిగితే స్వరాజ్యంలో పొట్టకొరకు శరీరాన్ని అవమానకరంగా అమ్ముకో వలసివస్తున్న పరిస్తితులను కాంగ్రెసు నాశనం గావిస్తుంది. నిరుద్యోగాన్ని నిర్మూలించి అందరికీ పని కలిపిస్తుంది. పనిజేసేవారందరికీ సుఖంగా జీవించటానికి కావలసిన కనీసపుకూలి యేర్పాటు జేసి తద్వారా అవమానకరమైన వ్యభిచార వృత్తిని నాశనం జేస్తుంది అని జవాబు యిస్తాను. అట్టికూలీలకు, వ్యవసాయదారులకు కనీసపు హక్కులనిచ్చే- కార్యక్రమము కాంగ్రెసు యేర్పరచ నంతకాలం కార్మికులు స్వరాజ్యోద్యమములో చేరరు. ఉద్రేకమువల్ల నీవంటివారు ఒక రిద్దరు చేరినా ప్రజాసామాన్యం చేరదు.

నర్సయ్య-- తెలివైన కబుర్లే చెపుతున్నావుగాని హేమాహేమీలైన కాంగ్రెసు నాయకులు, గాంధి మహాత్ముడు నీకంటె తెలివైనవాళ్లు. ఆ సంగతి తెల్సుకో.

నేను--నేను వారి తెలివినిగూర్చి ప్రశ్నించడము లేదు వారు నిన్నూ నన్నూ ప్రజలందరిని ముంచగల తెలివిగలవాళ్లు. ఆ తెలివితేటలు షాహుకార్లు, యజమానులు, బ్యాంకర్లకు లాభం కూర్చుటకు మాత్రమే.

నర్సయ్య-- పిచ్చపిచ్చ ఆరోపణలు చేయవద్దు. నాకు వారి యెడల నమ్మకముంది గనుక వారిలోచేరి పని జేస్తున్నాను. అంటూ శిబిరంలోకి దారితీశాడు. నేను ముందైనా తెల్సుకుంటాడులే అనుకున్నాను.

* * *

౨ వభాగం.

ఒక రోజున నరసయ్య వర్కుషాపుకు వచ్చి, యజమానుని, అతని ప్లైజరుకారు, మా వూరు వస్తున్న ఉత్తరదేశ కాంగ్రెసు నాయకుని స్టేషనుంచి తీసికొని వచ్చుటకు యివ్వమని అడిగాడు. యజమాని అభిమానించి, నన్ను

కారుతీసికొని వెళ్ళి రోజల్లా కాంగ్రెసువారు చెప్పినటుల చేయమని హుకుం జారీ చేసాడు.

కరాచీ కాంగ్రెస్ మహాసభ, పౌరసత్వ హక్కుల నిర్ణయించడానికి, ఒక సబ్ కమిటీ నియమించింది. దానిలో మా జిల్లానాయకుడు మెంబరు సబ్ కమిటీ మా వూళ్ళోనే సమావేశమవుతుంది. సభ్యులు ఉత్తర హిందూస్థానంనుంచి 3గంటలలో రైలులో దిగుతారు. వారిని ఆహ్వానించుటకు జిల్లా కాంగ్రెసు బ్రహ్మాండమైన ఏర్పాటుల చేసింది. నేను తీసికొని వెళ్ళిన కారులో నరసయ్య పెద్ద పూలదండలు పుచ్చుకొని స్టేషనుకు వచ్చాడు.

రైలువచ్చి స్టేషనులో ఆగింది. ప్లాటుఫారంపైవున్న కాంగ్రెసువారు పేరుపేరున జేజేలుకొట్టారు. ఫస్టుక్లాస్ పెట్టెనుండి, సూటు, బూటులు ధరించిన నాయకులు దిగారు. వారిలో కొందరు ధరించిన దుస్తులు, స్వదేశీ కావచ్చును గాని ఖద్దరుమాత్రం కాదు. ఉద్రేకంతో వుప్పొంగిపోయి, నాయకుల కంఠసీమల పూలమాలలు పూజసేయ వికసించిన, నరసయ్య చేతులు ముకుళించుకు పోయినవి. స్వేచ్ఛా దారిద్ర్యాన్ని బోధించే గాంధీతత్వం, బాగా వంటబట్టిన నరసయ్యకు, వారి వేషధారణ వెగటుతోచింది. ఆ అమాయకుని మెరటు మనస్సు, గాంధి తత్వాన్ని, పెద్దలు తమ కనుకూల పడునటుల లౌక్యార్థాలు కల్పించుకొని సమన్వయించుకోలేక పోయింది. ఛీ! ఖద్దరైనా ధరించని నాయకులకు ధిక్కారమనుకొన్నాడు. చేతిలోని దండలు చేతిలోనే వుండిపోయినవి. జరుగవలసిన కార్యకలాప మంతయు జరిపారు. నాయకులు బసలకు జేరారు.

నరసయ్య ప్రవర్తనపై విమర్శలు సాగినవి. ఏదో గట్టివాడని పైకి తెస్తే బిరబిగిసాడోయి: నాయకులను ప్రశ్నించే అంతవాడా? అన్నారు ఛోటానాయకులు. దెబ్బలు తిన్నంతమాత్రాన గొప్పవాడననే గగరు! అని తాళంవేసారు అర్థం చేసికోలేని కురలు. వారికేమి తెలుసు అతని మనస్సులోని పోరాటం?

సాయంకాలం బహిరంగసభ. చౌకులో విపరీతంగా జనంవచ్చారు. వ్యక్తులను, నాయకులను అనన్య సామాన్యులుగా వర్ణించే కాంగ్రెస్ ప్రచారం మూలాన, ప్రజలు సావధానంగా వింటున్నారు. నరసయ్య, తాను నాయకుల మాటలనుండి నేర్చుకొన్న గాంధితత్వం, ఖద్దరు ధరించని నాయకునికి గౌరవమివ్వడం అర్థం చేసుకోలేక పోయింది. అతని చిన్ని మనస్సులో అనేక అనుమానాలు ఉత్పన్నమయ్యాయి. సభలో ప్రశ్నించి సందేహాలు తీర్చుకుందామనుకున్నారు. ఆ నాయకు నుద్దేశించి ఖద్ద రెందుకు ధరించలేదని ప్రశ్నించాడు. ఛోటానాయకులు నరసయ్యసభలో అల్లరి మొదలెట్టినటులెంచి అతనిని సభ బయటికి పంపివేశారు. పోరాటాని కివ్వవలసిన గొప్పదనం, ఖద్దరునకిచ్చి అనవసర ప్రాముఖ్యమిచ్చి, సర్వానిష్టాలకు పరమాషదమని బోధించే నేతలు ఆ సత్యాన్వేషికి కల్గిన సందేహాలు తీర్చలేకపోయారు పైగా అహంకారి అని త్రోసివేశారు.

నరసయ్యకు నాయకులపై నమ్మకం సన్నగిలినా, మహాత్మునిపై విశ్వాసం తగ్గలేదు. యీ నాయకులంతా గాంధి ఉపదేశాలను ఆ చరణలో పెట్టజాలని స్వార్థులను కొంటాడేగాని ఆ సూత్రాలు ఆచరణలో అసంభవమనే సంగతి గ్రహించలేదు. అందుచేతాను మహాత్ముని శిష్యుడనీ, నాయకులంతా వేషధారులని సంతృప్తిపడేవాడు.

రౌండుటేబిలు కాన్ఫరెన్సులో, భారతీయుల హక్కులు నిరాకరించబడి, దేశంలో ప్రభుత్వ నిర్బంధ విధానంవల్ల మరల సత్యాగ్రహోద్యమము ప్రారంభమయింది. నాయకులందరిని ఏ. బి. క్లాసులిచ్చి

జైలుకు పంపారు. వాలంటీర్లను లాఠీతో మోదుట ప్రారంభించారు. ప్రభుత్వం వారిని జైలుకు పంప దలచలేదు. లాఠీ చార్జీల హింసతో ప్రజలను భయపెట్టి అణచే ప్రయత్నాలలో వుంది. స్వాతంత్ర్యం కాంక్షించే, ఉద్రేకులయిన, కొందరు యువకులు ముందుకువచ్చి పనిచేసారు. దెబ్బలు తిన్నారు అనేకసార్లు. నరసయ్య శరీరం నలగగొట్టారు. ఒక చేయి విరిగింది. జైలుమాత్రం ప్రాప్తి కాలేదు.

ఏలాగో జైలుకెళ్ళిన వారు, జైలుకు పోలేనివారిని, జైలుకు పోలేనివారిని, జడిసిరాలేదని ఆక్షేపించారు. కాని బైటకొచ్చిన తరువాత వారూ చేసింది ఏమీ లేదు.

అసలు ఉద్యమతత్వం ప్రజా సామాన్యానికి నచ్చలేదు. నిరాయుధులైన వాలంటీర్లను మోదటం, ప్రతీకారం చేయలేనివారు విధిగా దెబ్బలకోసం ఎదురెళ్ళటం; ప్రభుత్వాన్ని ఎటు స్తంభింపజేస్తుంది, స్వాతంత్ర్య మెలా వస్తుందో, సహజంగా ఆలోచించే సామాన్యుల దృష్టికి గోచరం కాలేదు. పర్యవసానం ఉద్యమం క్షీణించింది. గాంధిగారు జైలునుంచే హరిజనోద్యమం లేవదీశారు. పిన్నలు, పెద్దలు అంతా ఏమీ తోచక ఆమోజులో మునిగారు. రాజకీయోద్యమం సంఘసంస్కరణలోకి మారింది. ఇదివరకు రాట్నమే 'సర్వ రోగ నివారిణి' అన్నవారంతా, ఆపేరు యిప్పుడు హరిజన సమస్యకు తగిలించారు. నరసయ్య భార్యతో సహా గూడెముల వెంట ప్రచారం చేసాడు. బజార్లు వూడ్చాడు, ఎంతచేసినా కాంగ్రెసు వారు యిపుడు నమ్మకంగా చూడటం లేదు. అతని నేరాలు రెండు: ఒకటి తాము నేర్పిన, ఖద్దరు పై అభిమానంవల్ల నాయకులనే తిరస్కరించడం, యింకొకటి రెండోసారి జైలుకు రాజాలక పోవటము (ఎన్నిసార్లు దెబ్బలుతింటే మాత్రమేం!)

నరసయ్య సహన శక్తి నశించింది. వారు లోలోన నరసయ్య పనికి మాలిన వాడని ప్రచారం చేస్తే, యితడు బహిరంగంగా నాయకుల లోపాలన్నీ లెక్కించుతూ అధిక్షేపించుట మొదలెట్టాడు.

విడుదల అయిన గాంధిగారు, సత్యాగ్రహోద్యమం అపజయమొందడానికి కారణం, సత్యాగ్రహులు, సత్యం, అహింసలను సరిగా గ్రహించక పోవుటేనని, వాలంటీర్లపై రుద్దారు.

ఈమాత్ర మింగుట నరసయ్యకు కూడా కష్టమే అయింది.'

* * *

జైళ్ళలో బాగా ఆలోచించి, ప్రపంచ రివల్యూషనరీ చరిత్రను చదివిన, అతివాదులంతా కాంగ్రెసు సోషలిష్టు పార్టీ నేర్పరచారు. వారు కార్మికులమధ్య, రైతుల మధ్య ప్రచారం మొదలెట్టారు. మా జిల్లాలోని బస్సుపని వాళ్ళంతా ఒక లేబరు యూనియన్ యేర్పరచుకొన్నాం. నేనూ చేరాను. ఆ సోషలిష్టు యువకులు మాకు అపుడపుడు క్లాసులు పెట్టి, ప్రపంచ విషయాలు, కూలీ సంఘాలవల్ల లాభాలు, కూలీరాజ్యం రష్యాను గురించి, చెబుతూ వున్నారు. మాలో ఒక విధమైన చైతన్యం కలిగించారు. ఎన్నో విషయాలు తెలిసికోవాలనే ఆతురత, చుట్టూ వున్న పరిస్థితులపై అసంతృప్తి, మార్పుకొరకు ఆ వేదన, మా పనివాళ్ళకు మనస్సు కలచివేస్తున్నాయి.

నరసయ్య, నేను అపుడపుడు, మా యూనియను గురించి, సోషలిష్టు పార్టీని గురించి తర్కించుకొనే వాళ్ళం. అకుంఠిత ఛాందసంతో కొల్చిన నాయకులు, దైవసమానమని యెంచిన మహాత్ముడు, తా నిర్మించుకొన్న వూహాసౌధాన్నుండి పతనమైనప్పటినుండి, అతనికి అందరి యెడల అపనమ్మకమే. ఒకరోజున మా సంభాషణలో యిలా అన్నాడు నరసయ్య:

"బీదలకోసం పాటు పడతామనే యీ సోషలిష్టులు ఖద్దరును కూడ ఆక్షేపించుదు రేమి?

నేను:-ఖద్దరు స్వాతంత్ర ఉద్యమంలో ఒక భాగం కాదు. ఇంటింటరాట్నము లాడే రోజుల్లోనే మనదేశం స్వాతంత్రం కోల్పోయింది: కాన రాట్నాల పునః ప్రతిష్ట వలన స్వరాజ్యం రాదు. అంతగాక రాట్నము ఆచరణలో పెట్టతగిన, బీదలను రక్షించే ఆర్థికసూత్రము కాదు. స్వాతంత్ర్య మనుభవించే దేశాలలో సైతము యంత్రాల రాకతో, రాట్నాలు వగయిరా చేతి పరిశ్రమలు నశించి పోయినవి కాన యిప్పటి ఆర్థిక విధానంలో రాట్నం తిరిగి నెలకొల్ప జూచుట వెర్రి అని వారి వాదన.

నరసయ్య:-అయితే బీదల కొరకు పాటుబడే వీరు దర్జాగా దుస్తులు ధరించుట సబబా?

నేను:-సోషలిష్టులు ప్రజలకు దారిద్ర్యాన్ని, నికృష్టజీవితాలను భవించమని బోధించరు. స్వేచ్ఛా దారిద్ర్యం వీరి ఆదర్శం కాదు. ఇదివరకే దేశంలోవున్న దారిద్ర్యాన్ని నాశనం కావించాలిగాని, యింకా కొందరు, వారిని అనుకరించుటవలన బీదల కష్టాలు యీడేరవు.

నరసయ్య:-ఐతే ఉన్నమట్టుకు అనుభవించుకేనా వీరిపని?

నేను:-కాదు,- బీదలైన కార్మిక, కర్షకులలో ఐక్యత కలుగజేసి వారివారి సంఘాలద్వారా వారి హక్కులకై పోరాడుతారు. తత్ఫలితంగా కార్మికకర్షక ప్రజా ప్రభుత్వం స్థాపించుట వీరి ఆదర్శాన్ని జేరడానికి ఎన్ని కష్టాలైనాపడతారు. తమ సర్వస్వం ధారపోస్తారు. అంతేగాని ఖరీదైనా ఖద్దరు అంగవస్త్రము మోకాలు దిగకుండా ధరించి, దరిద్రంతో కృంగిపోయే ప్రజలకు దిగంబరత్వం బోధించడాన్ని సోషలిష్టులు ఆక్షేపించుతారు.

నరసయ్య:-ఏమో! ఆ దృష్టినుంచి చూస్తే వారివాదన సబబుగానే వుంది. ఐనా తొందరపడి నమ్మరాదు. బాగా ఆలోచించుకోవాలి, అని కింకర్తవ్యమూఢుడై వెళ్ళాడు.


ముఖాన కత్తివేసినా నెత్తురుచుక్కలేదు.



అటువంటి వారికి క్రొత్త జీవితోత్సాహము, సౌఖ్యజీవనము ప్రసాదించేది

"అమృత"

కేసరికుటీరం

ఎగ్మూర్, మదరాసు.